# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

VC NEWS

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ సోమవారం 16 జూన్ 2025

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 326

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




2లో

కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లకు ఎంపీ అరవింద్ వినతి




## తెలంగాణలో హాట్ హాట్‌గా..

## బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల మధ్య

# పొలిటికల్ వార్

**తెలంగాణ రాజకీయాలు మరోసారి హాట్ హాట్‌గా మారాయి. బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల మధ్య మరోసారి పొలిటికల్ వార్ రాజుకుంది. భద్రకాళీ చెరువు పూడికతీత పనులపై నెలకొన్న రాజకీయ రగడ చర్చనీయాంశంగా మారింది.**

**హనుమకొండ:** తెలంగాణ రాజకీయాలు మరోసారి హాట్ హాట్‌గా మారాయి. బీఆర్ఎస్ , కాంగ్రెస్ నేతల మధ్య మరోసారి పొలిటికల్ వార్ రాజుకుంది. భద్రకాళీ చెరువు పూడికతీత పనులపై నెలకొన్న రాజకీయ రగడ చర్చనీయాంశంగా మారింది. ఒక్కసారిగా బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల మధ్య రాజకీయాలు భగ్గుమన్నాయి. మాటల తూటాలతో రెండు పార్టీల్లోని నేతలు రెచ్చిపోయారు. భద్రకాళీ చెరువు పూడికతీత పనుల్లో నిధుల దుర్వినియోగం జరిగిందని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ ఆరోపణలు చేశారు. వినయ్ భాస్కర్ వ్యాఖ్యలపై వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. టెండర్లు ప్రకటించినా ఎవరూ ముందుకు రాకపోవడంతో పనులు ఆలస్యమయ్యాయని వినయ్ భాస్కర్ అన్నారు. పూడికతీత పనుల్లో ఎలాంటి నిధుల దుర్వినియోగం జరగలేదని ఆయన చెప్పారు. మాజీ మంత్రి కేటీఆర్‌ని చర్చకు రమ్మను తాను సిద్ధమని నాయిని రాజేందర్‌రెడ్డి సవాల్ విసిరారు. గతంలో కుడాకు ఒక రూపాయి అయినా నిధులు తెచ్చినట్టు రుజువు చేస్తే ఎమ్మెల్యే పదవికి తాను రాజీనామా చేస్తానని నాయిని రాజేందర్‌రెడ్డి ఛాలెంజ్ చేశారు. బీఆర్ఎస్ నేతలు సామాజిక ఉగ్రవాదులు వీళ్లను ఎన్‌కౌంటర్ చేయాలని నాయిని రాజేందర్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ నేతల పరిస్థితి దొంగే దొంగా అన్నట్లుగా ఉందని విమర్శించారు. వరంగల్‌లో కుడా నిధులు దుర్వినియోగం చేసినందుకు కేటీఆర్‌పై కేసు పెడతామని హెచ్చరించారు. అప్పుడు మున్సిపల్ మంత్రిగా ఉన్న కేటీఆర్ ఆధ్వర్యంలో నిధుల దుర్వినియోగం జరిగిందని ఆరోపించారు.

బీఆర్ఎస్ చీడ పురుగులలాంటి వాళ్లు... వీళ్లను వెంటనే జైల్లో పెట్టాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి హెచ్చరించారు. తాము కక్ష సాధింపు చర్యలకు దిగితే ఇక్కడి బీఆర్ఎస్ నేతలు హైదరాబాద్‌కి పారిపోతారని నాయిని రాజేందర్‌రెడ్డి విమర్శించారు.




# నేడు తెలంగాణ కేబినెట్ సమావేశం..

హైదరాబాద్: తెలంగాణ కేబినెట్ సోమవారంనేడు మధ్యాహ్నం రెండు గంటలకు సమావేశం కానుంది.? కేబినెట్ సమావేశంలో భాగంగా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై నిర్ణయం తీసుకోనున్నారు. దీంతో, ఎన్నికలపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనే చర్చ మొదలైంది. మరోవైపు.. ఈ నెలాఖరులోగా స్థానిక సంస్థల ఎన్నికలకు షెడ్యూల్ విడుదలవుతుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సోమవారం నిర్వహించే క్యాబినెట్ సమావేశంలో చర్చించిన అనంతరం ఎన్నికల తేదీపై స్పష్టత ఇస్తామని చెప్పారు. తొలుత ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు.. ఆ తర్వాత సర్పంచ్, మున్సిపల్ ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. స్థానిక ఎన్నికలకు 15 రోజుల గడువు మాత్రమే గడువుందని.. కాంగ్రెస్ శ్రేణులు సిద్ధం కావాలని చెప్పారు.

## నెలాఖరులోగా స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్



ఖమ్మం: ఈ నెలాఖరులోగా స్థానిక సంస్థల ఎన్నికలకు షెడ్యూల్ విడుదలవుతుందని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సోమవారం నిర్వహించే క్యాబినెట్ సమావేశంలో చర్చించిన అనంతరం ఎన్నికల తేదీపై స్పష్టత ఇస్తామని చెప్పారు. తొలుత ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు.. ఆ తర్వాత సర్పంచ్, మున్సిపల్ ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. కూసుమంచిలోని క్యాంపు కార్యాలయంలో వివిధ ప్రాంతాల ముఖ్యనేతలతో మంత్రి సమావేశం నిర్వహించారు. స్థానిక ఎన్నికలకు 15 రోజుల గడువు మాత్రమే ఉందని.. కాంగ్రెస్ శ్రేణులు సిద్ధం కావాలని పొంగులేటి సూచించారు. గ్రామాల్లో చిన్న చిన్న లోటుపాట్లు ఉంటే వాటిని సరిదిద్దుకుని ముందుకెళ్లాలని చెప్పారు. గెలిచే అవకాశాలు ఉన్న అభ్యర్థులనే ఎంపిక చేస్తామన్నారు. వారం రోజుల్లో 'రైతు భరోసా', సన్నాలకు బోనస్‌ను రైతుల ఖాతాల్లో జమచేస్తామన్నారు. సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత స్థానిక నేతలదేనని చెప్పారు.

# బాసరలో విషాదం

## గోదావరి నదిలో మునిగి ఐదుగురు మృతి..



ముథోల్: నిర్మల్ జిల్లా బాసరలో విషాదం చోటు చేసుకుంది. గోదావరిలో స్నానానికి దిగి ఐదుగురు యువకులు మృతి చెందారు. మృతులంతా ఒకే కుటుంబానికి చెందిన వారు. వారిని హైదరాబాద్‌లోని బేగంబజార్‌కు చెందిన రాకేశ్, వినోద్, మదన్, రుతిక్, భరత్‌గా గుర్తించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం భైంసా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆదివారం ఉదయం 18 మంది కుటుంబ సభ్యులు బాసరకు వచ్చారు. అమ్మవారి దర్శనానికి ముందు గోదావరి నదిలో పుణ్యస్నానాలు చేయడానికి బోటుపై నది మధ్యలోకి వెళ్లారు. ఈక్రమంలో అయిదుగురు నీటమునిగి మృతి చెందారు. స్థానికులు, గజ ఈతగాళ్ల సహాయంతో మృతదేహాలను బయటికి తీశారు. సీఐ మల్లేశ్, ఎస్సై శ్రీనివాస్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.




## ఇజ్రాయెల్‌పై సరికొత్త క్షిపణిని ప్రయోగించాం: ఇరాన్

**ఇజ్రాయెల్‌పై ఇరాన్ సరికొత్త క్షిపణిని ప్రయోగించినట్లు ప్రకటించింది.**

ఇజ్రాయెల్‌పై అత్యాధునిక క్షిపణిని ప్రయోగించామని ఇరాన్ ప్రకటించింది. ఆ దేశానికి చెందిన ఫార్స్ న్యూస్ ఏజెన్సీ ఈ విషయాన్ని తెలిపింది. ఆదివారం ఇరాన్ జరిపిన క్షిపణి దాడిలో హాజ్ ఖాస్సేం గైడెడ్ బాలిస్టిక్ మిసైల్‌ను వినియోగించారు. ఇరాన్ రక్షణ మంత్రి అజీజ్ నసీర్‌జాదా మే 4న ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ తమ వద్ద సరికొత్త బాలిస్టిక్ మిసైల్ సిద్ధమైందని ప్రకటించారు. అది అమెరికా థాడ్, పేట్రియాట్ గగనతల రక్షణ వ్యవస్థలను కూడా ఛేదించుకొని వెళ్లగలదని పేర్కొన్నారు. ప్రస్తుతం ఇజ్రాయెల్ వీటిని కూడా వినియోగిస్తోంది. ఈ సరికొత్త క్షిపణి రేంజ్ 1200 కిలోమీటర్లుగా ఇరాన్ పేర్కొంది. దీని వార్ హెడ్ తన గమనాన్ని మార్చుకోగలదని.. అందుకే ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను ఛేదిస్తుందని వెల్లడించింది. దీనికి ఐఆర్‌జీసీ ఖుద్స్ ఫోర్స్ జనరల్ ఖాసిం సులేమానీ పేరు పెట్టినట్లు చెప్పింది. కాకపోతే దీనిని కచ్చితంగా ఏ ప్రదేశంపై ప్రయోగించిందో మాత్రం వెల్లడించలేదు. నిన్న రాత్రి ఇరాన్ జరిపిన క్షిపణి దాడుల్లో 200 మంది గాయపడ్డారని ఇజ్రాయెల్ ప్రభుత్వం వెల్లడించింది. బెట్‌యాప్ ప్రాంతంలో దాదాపు 35 మంది ఆచూకీ గల్లంతైందని ఆ దేశ మీడియా పేర్కొంది. ఇరాన్‌తో పోరు రోజుల్లో ముగిసేదికాదు: అమెరికాఇరాన్‌తో మొదలైన సంక్షోభం రోజుల్లో ముగిసే విషయం కాదని అమెరికా శ్వేతసౌధం, ఇజ్రాయెల్ అధికారులు పేర్కొన్నారు.

## కేదారనాథ్ కు వెళ్తుండగా

# కూలిన హెలికాప్టర్.

- చిన్నారి సహా ఏడుగురు దుర్మరణం.



**వేగుచుక్క న్యూస్:** ఉత్తరాఖండ్ లోని గౌరీ కుండ్ లో బయలుదేరిన 10 నిమిషాలకే హెలికాప్టర్ కూలిపోయింది. ఈ ఘటనలో చిన్నారి సహా ఏడుగురు దుర్మరణం చెందారు. ఆర్యన్ ఏవియేషన్ కు చెందిన హెలికాప్టర్ గుప్త కాశి నుంచి కేదార్నాథ్ కి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మృతుల్లో పైలెట్ కూడా ఉన్నారు. ఉత్తరాఖండ్ పౌర విమానయాన అభివృద్ధి అథారిటీ తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం తెల్లవారుజామున 5.20 గంటలకు ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్ లకు చెందిన ఆరు మంది యాత్రికులతో హెలికాప్టర్ గుప్తకాశి నుంచి కేదార్నాథ్ కు బయలు దేరింది. అందులో సాంకేతిక సమస్యలు తలెత్తడం, వాతవరణం అనుకూలంగా లేకపోవడంతో బయలుదేరిన పది నిమిషాల్లోనే కుప్పకూలింది. సమాచారం అందుకున్న అధికారులు ఘటనస్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద స్థలంలో సహాయక చర్యలు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.



## సీఎం రేవంత్‌రెడ్డితో కేంద్రమంత్రి జయంత్ చౌదరి భేటీ

**రాష్ట్రంలో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలకు సహకరిస్తామని కేంద్ర స్కిల్ డెవలప్‌మెంట్ శాఖ మంత్రి జయంత్ చౌదరి హామీ ఇచ్చారు.**

హైదరాబాద్: రాష్ట్రంలో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలకు సహకరిస్తామని కేంద్ర స్కిల్ డెవలప్‌మెంట్ శాఖ మంత్రి జయంత్ చౌదరి హామీ ఇచ్చారు. కౌశల్ మందన్ కార్యక్రమానికి హాజరయ్యేందుకు హైదరాబాద్ వచ్చిన కేంద్రమంత్రి .. సీఎం రేవంత్‌రెడ్డితో ఆయన నివాసంలో భేటీ అయ్యారు. రాష్ట్రంలో నైపుణ్యాభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. రాష్ట్రంలో స్కిల్ డెవలప్‌మెంట్ కోసం తీసుకుంటున్న చర్యలను కేంద్ర మంత్రికి సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. రాష్ట్రంలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుపై రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్ర మంత్రి అభినందించారు.

# నదిలో కూలిన వంతెన.. అనేక మంది గల్లంతు!



పుణె: ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ఇంద్రాయణి నదిపై ఉన్న ఓ వంతెన కుప్పకూలింది. ఈ ఘటనలో అనేక మంది పర్యటకులు గల్లంతయ్యారు. వీరిలో నలుగురు ప్రాణాలు కోల్పోగా ఆరుగురిని స్థానికులు రక్షించినట్లు సమాచారం. మిగతావారి కోసం గాలింపు కొనసాగుతోంది.

పుణె జిల్లాలోని ఇంద్రాయణి నదిపై కుందమాలా పర్యాటక ప్రాంతానికి ఆదివారం పర్యటకులు పోటెత్తారు. అక్కడున్న ఇనుప వంతెనపై అనేక మంది వచ్చి నిలబడిన క్రమంలోనే కొంతభాగం ఒక్కసారిగా కుప్పకూలింది. దీంతో అనేక మంది నదిలో కొట్టుకుపోయారు. వెంటనే రంగంలోకి దిగిన స్థానిక పోలీసులు, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు రెస్క్యూ ఆపరేషన్ చేపట్టాయి. పలువురిని రక్షించినప్పటికీ.. అనేక మంది జాడ తెలియరాలేదు.

ఇంద్రాయణి నదిపై ఈ ఇనుప వంతెనను 30 ఏళ్ల క్రితం నిర్మించినట్లు స్థానిక ఎమ్మెల్యే వెల్లడించారు. ఇది కేవలం కాలినడక మార్గమే. ప్రమాద సమయంలో వంతెనపై దాదాపు 100 మంది ఉన్నారని, అందులో అనేక మంది ఒడ్డుకు చేరుకున్నప్పటికీ పలువురు గల్లంతయ్యారని చెప్పారు. ఇదిలాఉంటే, మహారాష్ట్రలో అనేక ప్రాంతాల్లో రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. పుణెతోపాటు, పింప్రీ చించ్వాడ్ ప్రాంతాలకు వాతావరణశాఖ ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది.

వేగుచుక్క



## యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వారాంతం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారితో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది. వేకువజాము నుంచే దర్శనం కోసం భక్తులు బారులుతీరారు. ప్రసాదం కౌంటర్ల వద్ద భారీ క్యూలైన్లు కనిపించాయి.

## కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లకు ఎంపీ అరవింద్ వినతి



**హైదరాబాద్:** ఫోన్ ట్యాపింగ్ కేసును కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారణ జరిపించాలని బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఎంపీ అరవింద్ పీటీఐతో మాట్లాడిన సందర్భాన్ని ఎక్స్‌లో షేర్ చేశారు. ' కేసీఆర్ ప్రభుత్వంలో నా ఫోన్ ట్యాప్ చేశారంటూ వస్తున్న వార్తలు ఆందోళన కల్గిస్తున్నాయి.
నాపై మానసికంగానే కాదు.. శారీరకంగానూ కేసీఆర్ ప్రభుత్వం దాడి చేయించింది. ఇది రాజకీయ ఎజెండా మాత్రమే కాదు.. ఇది నేరపూరితమైన దాడి. ఫోన్ ట్యాపింగ్ ద్వారా కేవలం ఫోన్ కాల్స్‌లోకే కాదు బెడ్ రూమ్‌లోకి, బాత్రూమ్‌లోకి చట్టవిరుద్ధంగా చొరబడ్డారు. నాపై వ్యతిరేకంగా ప్రచారం చేసేందుకు ప్రభుత్వ నిఘా వ్యవస్థను ప్రైవేటు నిఘా వ్యవస్థగా వాడుకుంది గత ప్రభుత్వం. ఇది ప్రజాస్వామ్యం జరిగిన దాడిగా చూడాలి. తెలంగాణ రాష్ట్రం నుంచి కేంద్ర మంత్రులుగా ఉన్న కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు ఈ విషయంలో చొరవ తీసుకుని కేంద్ర విచారణ సంస్థలతో దర్యాప్తు చేపట్టాలి' అని అరవింద్ కోరారు.

# అహ్మదాబాద్ విమాన ప్రమాద మృతుల గుర్తింపులో తీవ్ర ఇబ్బందులు

**అహ్మదాబాద్ విమాన ప్రమాదం: ఒకే బాడీ బ్యాగ్ లో రెండు తలలు...**

**సవాలుగా మారిన మృతుల గుర్తింపు!**

**ఒకే బాడీ బ్యాగులో రెండు తలలు లభ్యం, డీఎన్ఏ ప్రక్రియ మళ్లీ మొదటి నుంచి**

**సుమారు 72 గంటలు పట్టే డీఎన్ఏ పరీక్షలకు మరింత జాప్యం**

**తమవారి పూర్తి శరీర భాగాలను అప్పగించాలంటూ కుటుంబ సభ్యుల ఆవేదన**

**మృతదేహాలు పూర్తిగా కాలిపోవడంతో అప్పగింత కష్టమంటున్న అధికారులు**

**మృతుల బంధువుల కోసం సివిల్ ఆసుపత్రి మార్గదర్శకాలు జారీ**




అహ్మదాబాద్: వణికించిన ఘోర విమాన ప్రమాదంలో మరణించిన వారిని గుర్తించే ప్రక్రియ అధికారులకు పెను సవాలుగా మారింది. మృతదేహాలు పూర్తిగా కాలిపోయి గుర్తుపట్టలేని స్థితిలో ఉండటంతో, వారి ఆనవాళ్లను పట్టి బంధువులకు అప్పగించడం అత్యంత కష్టతరంగా తయారైంది. ఈ క్రమంలో ఎదురవుతున్న ఊహించని అవాంతరాలు బాధిత కుటుంబాల ఆవేదనను మరింత పెంచుతున్నాయి. మృతుల గుర్తింపులో డీఎన్ఏ పరీక్షలే కీలకంగా మారాయి. అయితే, ఈ ప్రక్రియలోనూ అనుకోని అడ్డంకులు తలెత్తుతున్నాయి. ఒక దిగ్భ్రాంతికర ఘటనలో, ఒకే బాడీ బ్యాగులో రెండు తలలు లభ్యమవడం గందరగోళానికి దారితీసింది. దీంతో డీఎన్ఏ నమూనాలను మళ్లీ మొదటి నుంచి సేకరించి పరీక్షించాల్సిన క్లిష్ట పరిస్థితి ఏర్పడిందని సివిల్ ఆసుపత్రి సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. సాధారణంగా 72 గంటలు పట్టే డీఎన్ఏ పరీక్షల ప్రక్రియ, ఈ తాజా పరిణామంతో మరింత ఆలస్యం కానుంది. శనివారం సివిల్ ఆసుపత్రి పోస్టుమార్టం గది వెలుపల హృదయవిదారక దృశ్యాలు ఆవిష్కృతమయ్యాయి. తమవారి పూర్తి శరీర భాగాలను అంత్యక్రియల నిమిత్తం అప్పగించాలంటూ ఓ వ్యక్తి అధికారులను వేడుకోవడం అక్కడున్న వారిని కంటతడి పెట్టించింది. అయితే, మృతదేహాలు తీవ్రంగా కాలిపోయినందున అది సాధ్యం కాదని అధికారులు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. "మృతదేహాలు పూర్తిగా కాలిపోయినందున, అన్ని శరీర భాగాలను వెలికితీసి ఇవ్వగలమని మేము కుటుంబాలకు హామీ ఇవ్వలేం" అని ఓ అధికారి నిస్సహాయత వ్యక్తం చేశారు. మృతదేహాల అప్పగింత ప్రక్రియను క్రమబద్ధీకరించేందుకు సివిల్ ఆసుపత్రి అధికారులు శనివారం కొన్ని మార్గదర్శకాలు జారీ చేశారు. డీఎన్ఏ నమూనా ఇచ్చిన బంధువులే మృతదేహాన్ని తీసుకెళ్లాలని, తప్పనిసరి పరిస్థితుల్లో సమీప బంధువులు గుర్తింపు పత్రాలతో రావచ్చని సూచించారు. మృతుడితో సంబంధాన్ని నిరూపించే పత్రాలు, ఆధార్ కార్డు తప్పనిసరి అని స్పష్టం చేశారు. మృతదేహాల తరలింపునకు ఎయిర్ ఇండియా, రోడ్డు మార్గాల్లో ఉచిత రవాణా సౌకర్యం కల్పిస్తామని అధికారులు తెలిపారు.

## ప్రభుత్వ బడుల్లో అత్యాధునిక సాంకేతిక బోధన.. ఎన్జీవోలతో విద్యాశాఖ ఒప్పందం

**ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో ప్రముఖ ఎన్‌జీవో సంస్థలతో రాష్ట్ర విద్యాశాఖ ఎంవోయూలు కుదుర్చుకుంది.**

హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో ప్రముఖ ఎన్‌జీవో సంస్థలతో రాష్ట్ర విద్యాశాఖ ఎంవోయూలు కుదుర్చుకుంది. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అత్యాధునిక సాంకేతిక బోధనా సేవలను ఉచితంగా అందించాలన్న లక్ష్యంతో ఎంవోయూ కుదుర్చుకున్నట్లు విద్యాశాఖ తెలిపింది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరొందిన ఆరు ప్రముఖ సంస్థల భాగస్వామ్యంతో ప్రభుత్వ పాఠశాలల్లో అధునాతన ఎడ్ టెక్ సదుపాయాలను ప్రభుత్వం కల్పించనుంది. ఇందుకు నందన్ నీలేకని నేతృత్వంలోని ఏక్ స్టెప్



ఫౌండేషన్, డాక్టర్ సునీతా కృష్ణన్ నేతృత్వంలోని ప్రజ్వల ఫౌండేషన్, అలక్ పాండే ఆధ్వర్యంలో ఫిజిక్స్ వాలా, ఖాన్ అకాడమీ, షోయబ్‌దార్ నిర్వహిస్తోన్న పైజామ్ ఫౌండేషన్, సఫీనా హుస్సేన్ ఆధ్వర్యంలోనే ఎడ్యుకేట్ గర్ల్స్ లాంటి పేరొందిన సంస్థలతో విద్యాశాఖ ఎంవోయూ కుదుర్చుకొంది. రాష్ట్రంలో విద్యా నాణ్యతా ప్రమాణాలను మెరుగుపరచాలన్న సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా విద్యాశాఖ ఈ నిర్ణయం తీసుకుంది. ప్రజాప్రభుత్వం అమలు చేస్తోన్న కార్యక్రమాలు, పథకాలకు ఆకర్షితులై రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు వివిధ సంస్థలు ముందుకొస్తున్నాయని ప్రభుత్వం తెలిపింది. నందన్ నీలేకని నేతృత్వంలో ఏక్ స్టెప్ ఫౌండేషన్ కృత్రిమ మేధ ఆధారిత ఫ్లాట్‌ఫామ్‌తో 540 పాఠశాలల్లో పనిచేస్తుంది. ఇకపై 33 జిల్లాల పరిధిలో 5వేలకు పైగా ప్రాథమిక పాఠశాలలకు విస్తరించనుంది. మూడో తరగతి నుంచి ఐదో తరగతి వరకు తెలుగు, ఇంగ్లీష్ భాషలతో పాటు మ్యాథ్స్ బేసిక్స్‌ను ఈ సంస్థ అందిస్తుంది.

# తెలంగాణలో స్థానిక సందడి

**మంత్రుల ప్రకటనలతో నేతల అలర్ట్**

**గ్రామాల్లో ఊపందుకోనున్న రాజకీయ వేడి**



హైదరాబాద్: తెలంగాణలో స్థానిక సంస్థలకు త్వరలోనే ఎన్నికలంటూ మంత్రులు అడపాదడపా ప్రకటనలు చేస్తున్నారు. గెలిచేది తామేనని కూడా ప్రకటిస్తున్నారు. ఈ క్రమంలో జూన్, జూలై మధ్య ఎన్నికలకు అవకాశాలు మెండుగా ఉన్నాయి. సర్పంచ్, ఎంపిటిసి, జడ్‌పిటిసి ఎన్నికలను నిర్వహించేలా లోలోపల వేగంగా పావులు కదుపుతు న్నాయని అనుకోవచ్చు. ఇటీవల మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, సీతక్క తదితరులు వరుస ప్రకటనలు చేస్తున్నారు. అలాగే రెవెన్యూ సదస్సుల పేరుతో మంత్రులు జిల్లాల పర్యటనలు చేసేస్తున్నారు. ఇదంతా ఓ రకంగా ప్రజల్లో తమ బలాన్ని మరింత పెంచుకునేలాచేసే యత్నమని గుర్తించాలి. ఈ క్రమంలో గ్రామాల్లో రాజకీయ వేడి రాజుకుంటోంది. కొన్ని రోజులుగా రాజకీయ పార్టీల సందడి జోరుగా కనిపిస్తోంది. ఇప్పటికిప్పుడు ఎన్నికలు లేకున్నా ఖాళీగా కూర్చునే ఆలోచనలో లేరు. పార్టీలన్నీ ఏదో ఓ కార్యక్రమంతో ప్రజల్లోకి వెళుతున్నాయి. నిత్యం ప్రజల్లోనే ఉంటున్నాయి. నేతలంతా ఏదో ఒక కార్యక్రమంలో ముందుకు సాగుతున్నారు. తెలంగాణలో బిజెపి, కాంగ్రెస్, బిఆర్‌ఎస్ కూడా నిత్యం కార్యక్రమాలతో ప్రజల్లోకి వెళుతోంది. ఇలా జిల్లాల్లో ప్రధాన రాజకీయ
పక్షాలు ప్రజాక్షేత్రంలోకి వెళ్లి బలోపేతం కావడానికి ప్రయత్నాలు చేస్తున్నాయి. ఒక్కో పార్టీ ఒక్కో పేరిట ప్రజల్లోకి వెళ్లి తమ వాణిని వినిపిస్తున్నాయి. బిఆర్‌ఎస్ దీనిని బాగా ఉపయోగించుకుంటోంది. తెలంగాణ మొత్తం అభివృద్ధి చెందిందన్న ప్రచారంతో ప్రజలను బురిడీ కొట్టిస్తోంది. తెలంగాణ సస్యశ్యామలం కావడమే గాకుండా బంగారు తునకగా మారిందన్న ప్రచారంతో నేతలు, అధినేతలు తరిస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీలు కూడా పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా నేరుగా ఓటరు వద్దకు వెళ్లుతున్నాయి. ఎమ్మెల్యేలు జనంలో ఉండాలన్న అధికార పక్షం ఆదేశాన్ని తూచా తప్పకుండా పాటిస్తున్నారు. ప్రజల మధ్య ఉంటూ తమ గెలుపునకు వ్యూహ రచన చేస్తున్నారు. ప్రతిపక్ష ఆశావహులు సైతం గెలుపు కోసం అనుసరించాల్సిన వ్యూహాలను సిద్ధం చేసుకుంటున్నారు. దీంతో పల్లెల్లో స్థానిక ఉన్నికల హడావిడి కనిపిస్తోంది. నిత్యం ఎదో ఒక పార్టీ నేత, ఏదో ఒక కార్యక్రమం పేరిట ప్రజల వద్దకు వస్తున్నారు. తమ తమ ప్రభుత్వాల పాలన, పార్టీ కార్యక్రమాలు, లక్ష్యాలు, పనితీరును వివరించడానికి నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. స్థానికి ఎన్నికల ఊహాగానాలు వినిపిస్తున్న నేపథ్యంలో రాజకీయ నాయకులు తమ దూకుడును పెంచుతున్నారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో హడావిడి స్పష్టంగా కనిపిస్తోంది. ప్రభుత్వ పథకాలపై బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, పార్టీ ప్రజా ప్రతినిధులు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. విమర్శలు చేస్తున్నారు. మంత్రులు రెవెన్యూ సదస్సులు ఇతర కార్యక్రమాల్లో భాగంగా ఊరూవాడ చుట్టేస్తున్నారు. కార్యక్రమాల్లో భాగంగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ ఇతర ప్రజాప్రతినిధులు ప్రజలతో భాగస్వామ్యమై కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇకపోతే విపక్ష బిఆర్‌ఎస్ గతంలో కెసిఆర్ సర్కార్ చేపట్టిన పథకాలను వివరించడం, లబ్దిదారులకు కల్యాణ లక్ష్మి, షాధీ ముబారక్, సీఎం సహాయ నిధి వంటి పథకాలు అటకెక్కాయని విమర్శలు చేస్తున్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పదకొండేళ్ల పాలనపై బీజేపీ నేతలు ప్రచారం నిర్వహిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తున్నారు. స్థానిక నేతలు నియోజకవర్గాల పరిధిలో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అరాచక పాలన అందిస్తోందని విమర్శిస్తూనే కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమాలు, పథకాలు, అభివృద్ధి పనులను వివరిస్తున్నారు.

# దేశానికి ఆదర్శం కాళేశ్వరం

**దానిని ఉపయోగించే పని చేయండి**

**మాజీమంత్రి వేముల సూచన**



నిజామాబాద్:తెలంగాణలో గత సిఎం కెసిఆర్ అనుసరించిన రైతు విధానాలను కాంగరెస్ పాటించివుంటే రైతులకు ఇన్ని కష్టాలు వచ్చివుండేవి కావని మాజీమంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. కాళేశ్వరంను ఎలా ఉపయోగించుకోవాలో కూడా వీరికి తెలియడం లేదన్నారు. రైతులకు సాగునీరు, పెట్టుబడి పథకం,బీమా పథకం అమలు చేయడం, పండిన ధాన్యం కొనుగోలు చేయడం వంటి పథకాలు పక్కాగా అమలయితే దేశంలో కరువు కాటకాలు ఉండవన్నారు. రైతులు ఆత్మహత్యలకు పాల్పడరని అన్నారు. ఇప్పటికే తెలంగాణ వ్యవసాయ రంగంలో ఓ రోల్ మాడల్‌గా నిలిచిందని అన్నారు. రైతుబీమా పథకం దేశానికే మార్గదర్శకంగా మారనుందని అన్నారు. వ్యవసాయాన్ని పండుగ చేయాలని తపించిన కెసిఆర్ రైతును రాజు చేయడమే లక్ష్యంగా అనేకానేక చర్యలు తీసుకుని ముందుకు నడిపించారని అన్నారు. అయితే కాంగ్రెస్ ఇవన్నీ పక్కన పెట్టి కాళేశ్వరంపై బురదజల్లే చర్యలకు ఉపక్రమించిందని అన్నారు. తెలంగాణ రైతులకు అండగా ఉంటూ వ్యవసాయరంగంలో నంబర్‌వన్ రాష్ట్రంగా నిలిపిన ఘనత కెసిఆర్‌దని అన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రైతు బీమా అమలు చేసిన ఏకైక రాష్ట్రం మనదేనని అన్నారు. ఏ కారణం చేతనైనా రైతు మరణిస్తే నామినీకి పది రోజుల్లో రూ.5 లక్షల ఇన్సూరెన్స్ అందించామని చెప్పారు. అందుకే ఈ పథకాలను తెలుసుకున్న దేశంలోని అన్ని రాజకీయపార్టీలు కేసీఆర్‌ను కొనియాడాయన్నారు. రైతుల కష్టాలు తెలిసిన కేసీఆర్ రైతుబీమా పథకాన్ని అమలులోకి తీసుకువచ్చారని అన్నారు. కాళేశ్వరంలో నీళ్లు ఎలా లిఫ్ట్ చేయాలో తెలియక పొలాలు ఎండబెట్టారని, ప్రాజెక్టుల్లో నీరు చేరకుండా చేశారని అన్నారు. కాళేశ్వరం సహా చేపట్టిన అన్ని ప్రాజెక్టులు పూర్తయితే ఇక సాగునీటికి ఢోకా ఉండదన్నారు. ఇప్పటికే చెరువుల పునరుద్దరణ కారణంగా జలకళను సంతరించుకున్నాయని అన్నారు. దీంతో సేద్యం అన్నది రైతుకు భారం కాబోదన్నారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో రైతు సంక్షేమ కార్యక్రమాలు ప్రారంభించుకుని, అమలు చేసుకున్నామని పేర్కొన్నారు. ఎన్నో ఇబ్బందులను అధిగమించి ముందుకు సాగుతుంటే కాంగ్రెస్ వాళ్లు కన్నీళ్లు పెట్టుకుంటున్నారని మండిపడ్డారు. రైతులు ఇబ్బందులు ఎదుర్కోకుండా విత్తనాలు, ఎరువులు ముందుగానే స్టాక్ పెట్టాలని పేర్కొన్నారు. పండిన పంటకు మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేయాలని పేర్కొన్నారు. తెలంగాణలో 24గంటల కరెంట్, నీళ్లు, పెట్టుబడి, ఎరువులు, విత్తనాలు ఇవ్వాలని అన్నారు.



# వైభవంగా ప్రసన్న వేంకటేశ్వరుడి రథోత్సవం

తిరుపతి: తిరుపతి అప్పలాయగుంట శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం 9.00 గంటలకు శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి రథోత్సవం వైభవంగా సాగింది. రథోత్సవంపై శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి విహరించి భక్తులను అనుగ్రహించారు. ఉదయం 7 - 8.30 గం.ల మధ్య పుణ్యాహవచనం, నవగ్రహపూజ చేపట్టారు. తదుపరి రథారోహణం, నిర్వహించారు. 09.00 - 10.30 గం.లకు భక్తజనసమోహం మధ్య రథోత్సవం చేపట్టారు. సాయంత్రం ఊంజల్ సేవ, అశ్వవాహనంపై స్వామి వారు భక్తులను ఆశీర్వదించనున్నారు. ఆదివారం ఉదయం పల్లకీ ఉత్సవం జరగనుంది. తదుపరి స్నపన తిరుమంజనం చేపడుతారు. అనంతరం ఉదయం 10.30 - 10.45 గం.ల వరకు తీర్థవారి చక్రస్నానం నిర్వహిస్తారు. సాయంత్రం శ్రీవారి మాడవీధి ఉత్సవం జరుగుతుంది. రాత్రి ఏడుగంటలకు ధ్వజావరోహణతో శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ముగియ నున్నాయి. వాహన సేవలో టిటిడి డిప్యూటీ- ఈవో హరీంద్రనాథ్, ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ శ్రీవాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, అర్చకులు, శ్రీవారి సేవకులు, భక్తులు పాల్గొన్నారు.



# ఇష్టంతో చదివి “ఉత్తమ ఫలితాలు” సాధించాలి.




**నిజామాబాద్ పోలీసు కమీషనర్ పి.సాయిచైతన్య.**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జూన్ 15:**

కృషితో నాస్తి దుర్భిక్షం అనే విషయాన్ని దృష్టిలో ఉంచుకొని విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదివి మంచి ఫలితాలు సాదించాలని నిజామాబాదు పోలీసు కమీషనర్ పి. సాయి చైతన్య ఉద్భోదించారు. ఎమ్మెస్సార్ చారిటబుల్ ట్రస్ట్ ఆద్వర్యంలో పది, ఇంటర్మీడియట్ తరగతుల్లో అత్యుత్తమ ఫలితాలు సాదించిన తెలంగాణ లోని 11 జిల్లాల నుంచి వచ్చిన రెండు వందల మంది విద్యార్థినీ, విద్యార్థులకు ఆదివారం నగరంలోని బస్వా గార్డెన్స్ లో పదివేల రూపాయల చొప్పున ఎమ్మెస్సార్ సహాయత చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి పోలీసు కమీషనర్ పి. సాయి చైతన్య ముఖ్యాతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, జీవితంలో ప్రతి ఒక్కరూ ఒక లక్ష్యాన్ని ఎంచుకొని ఆ లక్ష్యసాధనకు కష్టపడి ముందుకు సాగితే ఫలితం దక్కుతుందన్నారు. ఆర్థిక స్థితిగతుల మీద కాకుండా కష్టపడి చదివినందున ఈ రోజు ఎమ్మెస్సార్ ట్రస్టు పదివేల రూపాయల చొప్పున అందజేసిన చెక్కులకు తాము అర్హులమయ్యామనే విషయాన్ని విద్యార్థులు గుర్తెరగాలని సీపీ పేర్కొన్నారు. ఉన్నత విద్యాభ్యాసం కోసం పై తరగతులకు వెళ్తున్న విద్యార్థులు కొత్త పరిచయాలను తమ ఉన్నతి కోసం వాడుకోవాలని సూచించారు. చెడు పరిచయాలకు దూరంగా ఉండాలని, కొత్త పరిచయాల క్రమంలో మత్తుపదార్థాలకు అలవాటు పడవద్దన్నారు. వ్యక్తిత్వ వికాసం కోసం కష్టపడాలని సీపీ సాయిచైతన్య సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెస్సార్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మెన్ ఎం.సాంబశివారెడ్డి, డైరెక్టర్లు ధనుష్ రెడ్డి, జి.రాజిరెడ్డి, డాక్టర్ అబ్బాపూర్ రవి, వడ్డె శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# లయన్స్ యాంటీ డ్రగ్స్

## అవేర్నెస్ చైర్మన్ గా జిల్కార్ విజయానంద్.



**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జూన్ 15:**

హైదరాబాద్ లో ఆదివారం జరిగిన లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్. 320D ప్రిలిమినరీ క్యాబినెట్ సమావేశంలో 2025- 26 గవర్నర్ లయన్ అమర్నాథ్ రావు 2025- 26 సంవత్సరానికి యాంటీ డ్రగ్స్ అవేర్నెస్ కార్యక్రమాల జిల్లా చైర్మన్ గా జిల్కార్ విజయానంద్ ను నియమించారు. ప్రస్తుతం జోన్ చైర్మన్ గాలయన్స్ క్లబ్ ఇందూర్ కు పూర్వాద్యక్షులుగా విజయానంద్ వ్యవహరించారు. మత్తు పదార్థాల వల్ల జరిగే అనర్దాలను వివరించేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహింపజేయాలని ఈ సందర్భంగా అమర్నాథ్ రావు యాంటీ డ్రగ్స్ అవేర్నెస్ చైర్మెన్ విజయానంద్ కు సూచించారు. ఈ కార్యక్రమం లో జిల్లా వైస్ గవర్నర్ నరసింహరాజు, జిల్లా కోశాధికారి మర్రి ప్రవీణ్, జిల్లా కేబినెట్ అధికారులు డికొండ యాదగిరి, లక్ష్మీనారాయణ, కరిపే రవీందర్, రమేష్ కులకర్ణి పాల్గొన్నారు.

# తల్లికి వందనం చూసి ఓర్వలేక విషప్రచారం



**వైకాపా తీరుపై మండిపడ్డ మంత్రి గొట్టిపాటి**

అమరావతి: తల్లులకు చేకూర్చే లబ్ధి చూసి ఓర్వలేకే వైసిపి విషప్రచారం చేస్తుందని ఎపి మంత్రి గొట్టిపాటి రవికుమార్ మండిపడ్డారు. పాఠశాలలు తెరచిన రోజే పుస్తకాలు, నాణ్యమైన విద్యా కిట్ల పంపిణీకి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తల్లికివందనం కింద ఒక్కరోజులో విద్యార్థులకు రూ. 10 వేల కోట్ల లబ్ధి ఓ రికార్డు అని అన్నారు. మంత్రి నారా లోకేష్ విసిరిన సవాల్ స్వీకరించే ధైర్యం వైసిపిలో ఒక్కరికైనా ఉందా? అని ప్రశ్నించారు. నిన్నటి దాకా వైసిపి సైకోలు మహిళలను కించపరిచారని, ఇప్పుడు తల్లులు ఆనందంగా ఉండడం చూసి తట్టుకోలేకపోతున్నారని విమర్శించారు. రంగులు, బొమ్మల పిచ్చితో గత పాలకులు విద్యా వ్యవస్థను నాశనం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తు, టీచర్ల నియామకంపైనే కూటమి ప్రభుత్వం దృష్టి సారించిందని గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు.

# పత్తి కొనుగోలుకు విఫలమైన పద్ధతి ఆపాలి.

- **కేంద్రం ఒత్తిడికి రాష్ట్ర ప్రభుత్వం లొంగి ఆదిలాబాద్ జిల్లాల్లో అమలు.**
- **రైతాంగం ఐక్యంగా పోరాడి అడ్డుకోవాలి.**
- **అఖిల భారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. ప్రభాకర్ పిలుపు.**



వేగుచుక్క న్యూస్, హైదరాబాద్, జూన్ 15: పత్తి కొనుగోలులో మధ్యప్రదేశ్ రాష్ట్రంలో మోడీ ప్రభుత్వం 8 ప్రధాన పంటలకు వర్తింపజేసి విఫలమైన ధర వ్యత్యాస చెల్లింపు పథకం (టిడిపిఎస్) ను తెలంగాణ రాష్ట్రంలో పత్తి ఎక్కువ పండే ఆదిలాబాద్ జిల్లాలో ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టటాన్ని ఆపాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె. రంగారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఈ పథకాన్ని మోడీ ప్రభుత్వం నీతి ఆయోగ్ ద్వారా చేసిన ఒత్తిడికి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం లొంగవద్దని వారు కోరారు. వాస్తవానికి ఈ పథకం రైతు పంటలకు చట్టబద్ధమైన కనీస మద్దతు ధరకు రైతుల నుండి ప్రభుత్వం కొనుగోలు చేయకుండా తప్పుకొని, మార్కెట్ శక్తులకు రైతులను బలి చేసే చర్య తప్ప మరొకటి కాదని, అందువలన రైతులు సంఘటితంగా వ్యతిరేకించాలని అన్నారు. ప్రత్యామ్నాయ ధరల మద్దతు విధానంగా భావిస్తున్న పథకం వల్ల రైతు తన పత్తి పంటను బహిరంగ మార్కెట్లో విక్రయించిన తర్వాతే మార్కెట్ ధర కన్నా ఎంఎస్పి ఎంత తక్కువ ఉంటే ఆ మొత్తాన్ని నేరుగా డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్ఫర్ పద్ధతిన రైతు ఖాతాలో జమ చేస్తామని ప్రభుత్వం చెబుతుంది. అంటే ప్రభుత్వం రైతు దగ్గర పంట కొనదు, కానీ రైతు మార్కెట్లో నష్టపోయిన మొత్తాన్ని చెల్లిస్తా అంటుందనీ అన్నారు.

గత సంవత్సరం 2024 వాన కాలం సీజన్ లో తెలంగాణ రాష్ట్రంలో 44 లక్షల 73 వేల ఎకరాల్లో 20 లక్షల మందికి పైగా రైతులు సాగు చేస్తే 21 లక్షల మెట్రిక్ టన్నుల పత్తిని సీసీఐ కొనుగోలు చేసింది. అయితే ఇది 8.85 లక్షల మంది వద్దనే కొనుగోలు చేశారన్నారు. ఇలాంటప్పుడు మిగతా వారంతా ప్రైవేటు వారికే అమ్మారని స్పష్టం అవుతుందనీ అన్నారు. ఈ పథకం 2016-2017 లో అమలు చేశారు. సోయాబీన్, పెసర్లు, మినుములు, కంది, మొక్కజొన్న. నువ్వులు, వేరుసెనగలు తదితర పంటలకు వర్తించింది. కానీ రైతుల కు వ్యత్యాసాన్ని నిర్ధారించటంతో లోపాలు, వ్యత్యాసపు ధర చెల్లింపులు. అల సత్యం, మార్కెట్ ధరల తేడాలు. నిజమైన రైతులకు కాకుండా దళారులకు చెల్లింపులు వంటివి జరగడంతో అమ్మకాలు నిలిపివేశారనీ వారు వివరించారు. ఇలాంటి లోప భూయిస్టమైన టిడిపిఎస్ పథకాన్ని ఆదిలాబాద్ జిల్లా పత్తి రైతులపై రుద్దడాన్ని రైతాంగం సమైక్యంగా, చైతన్యంతో తిరస్కరిద్దాం అని అన్నారు.

# పొదిలి రాళ్లదాడి కేసు

## మరో 15మంది అరెస్ట్

**ఒంగోలు:** ప్రకాశం జిల్లా పొదిలిలో ఈనెల 11న మాజీ సీఎం జగన్ పర్యటనలో మహిళలు, పోలీసులపై రాళ్ల దాడి జరిగిన కేసులో మరో 15మందిని అరెస్ట్ చేశారు. రోడ్డు పక్కన నిరసన తెలిపిన మహిళలపై రెచ్చిపోయిన వైకాపా కార్యకర్తలు రాళ్లు, చెప్పులతో దాడి చేశారు. ఈ కేసులో ఇప్పటికే 9మందిని అరెస్టు చేయగా.. తాజాగా మరో 15 మందిని అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు. మరి కొందరు పరారీలో ఉన్నట్టు చెప్పారు. జగన్ కార్యక్రమానికి పోలీసుల అనుమతి పొందడంతో పాటు-, కార్యక్రమాన్ని నిర్వహించిన దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డికి పోలీసులు నోటీసులు జారీ చేశారు. పోలీసుల అనుమతి ప్రకారం కార్యక్రమం నిర్వహించలేదని, బారికేడ్లు తొలగించుకొని కార్యకర్తుల చొచ్చుకెళ్లడం, ర్యాలీలో క్రమశిక్షణ పాటించకపోవడం తదితర కారణాలు చూపుతూ పోలీస్ స్టేషన్‌కు వచ్చి సమాధానం చెప్పాలని బూచేపల్లికి శుక్రవారం నోటీ-సులు జారీ చేశారు. కానీ, ఆయన సమాధానమివ్వలేదు. బూచేపల్లి అందుబాటు-లో లేకపోవడంతో పరారయ్యారంటూ సోషల్ మీడియాలో ప్రచారం సాగింది. సోషల్ మీడియాలో వచ్చిన వార్తలను దృష్టిలో పెట్టు-కొని బూచేపల్లి ప్రకటన విడుదల చేశారు. తాను ఎక్కడికీ పారిపోలేదని.. తన పిల్లలను చూసేందుకు హైదరాబాద్ వెళ్లానని, పోలీసుల వద్దకు వచ్చి వివరణ ఇస్తానని పేర్కొన్నారు.

# జిల్లా “టైక్వాండో” నూతన కార్యవర్గం ఏర్పాటు.

**అధ్యక్ష కార్యదర్శులుగా అజ్మత్ ఖాన్, వినోద్ .**

**వేగుచుక్క న్యూస్, స్పోర్ట్స్:**





జిల్లా టైక్వాండో అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏర్పాటయింది. టైక్వాండో అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ రాష్ట్ర సంఘం ప్రధాన కార్యదర్శి మీర్ వాహజ్ అలీ ఈ ఎన్నికలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన సమక్షంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ తమ సంఘానికి గుర్తింపునిచ్చిందని ఆయన వెల్లడించారు. అయితే నిజామాబాద్ జిల్లా నుంచి గత ఐదు సంవత్సరాలుగా ఎంతోమంది క్రీడాకారులను టైక్వాండో క్రీడారంగంలో ప్రోత్సహిస్తూ వారిని ప్రయోజకులుగా తీర్చిదిద్దుతున్నారన్నారు. అదే స్పూర్తితో రాబోవు రోజుల్లో జాతీయ అంతర్జాతీయ స్థాయిలో నిజామాబాద్ జిల్లా క్రీడాకారులను తీర్చిదిద్దాలని నూతన కార్యవర్గాన్ని సూచించారు. టైక్వాండో క్రీడారంగాభివృద్ధి కోసం తమ వంతు సహాయ సహకారాలను నిజామాబాద్ జిల్లా అసోసియేషన్ కు ఎల్ల వేళలా అందిస్తామ న్నారు. అనంతరం నూతన కార్య వర్గాన్ని శాలువాతో సత్క రించి అభినం దించారు. అదేవిధంగా నూతన కార్యవర్గం ఆధ్వర్యంలో రాష్ట్ర సంఘం ప్రధాన కార్యదర్శి వహాజ్ అలీని ఘనంగా సత్కరించారు. ఈ ఎన్నికలకు ఎల క్షన్ ఆఫీసర్గా ఫుట్బాల్ కోచ్ జి. నాగరాజు వ్యవహరించారు. ఒలంపిక్ అసోసియేషన్ అబ్జర్వర్ గా అబ్దుల్ ఉమర్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో నెట్ బాల్ అసోసియేషన్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు జి. వెంకటేశ్వరరావు, జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సి. ఎస్. జయపాల్ తదితరులు పాల్గొన్నారు.

**నూతన కార్యవర్గం ఇదే**

టైక్వాండో అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గంలో చైర్మన్ గా డాక్టర్ రమేష్ పవర్, అధ్యక్షునిగా మహమ్మద్ అజ్మత్ ఖాన్, ప్రధాన కార్యదర్శిగా వినోద్ నాయక్, కోశాధికారిగా వినోద్, ఉపాధ్యక్షులుగా వాగ్మా రే సుభాష్, శ్యామ్, మంజునాథ్, వినోద్ రెడ్డి, రాము, సంయుక్త కార్యదర్శులుగా ప్రశాంత్ కుమార్, బుచ్చన్న, మురళి, వినోద్, ప్రవీణ్, సంతోష్ లను నూతన కార్యవర్గంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అయితే పూర్తి కార్యవర్గాన్ని త్వరలో నియమిస్తానని అధ్యక్షుడు అజ్మత్ ఖాన్ వెల్లడించారు.

# డిజిటల్ అరెస్ట్ పేరుతో మోసం



శ్రీకాకుళం: డిజిటల్ అరెస్టు పేరుతో సైబర్ మోసాలకు పాల్పడిన ముఠాను శ్రీకాకుళం పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి రూ.6లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు- చేసిన మీడియా సమావేశంలో డీఎస్పీ వివేకానంద కేసు వివరాలను వెల్లడించారు. డిజిటల్ అరెస్ట్ చేశామని శ్రీకాకుళానికి చెందిన ఓ లేడీ డాక్టర్ నుంచి రూ.13.50లక్షలు దోచుకున్నారని డీఎస్పీ చెప్పారు. చాకచక్యంగా వ్యవహరించిన పోలీసులు ముగ్గురిని అరెస్టు చేశామన్నారు. మరో ముగ్గురు నిందితుల కోసం గాలిస్తున్నట్టు- తెలిపారు. నిందితులంతా కేరళ రాష్ట్రానికి చెందిన వారిగా గుర్తించామన్నారు.

డిజిటల్ అరెస్ట్ అనే పక్రియ పోలీసుశాఖలో ఉండదన్నారు. ప్రజలు ఇలాంటి సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.


# అయోధ్యలో రామదర్బార్ దర్శనం

**భక్తులకు అనుమతించిన ట్రస్ట్**



అయోధ్య: ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య రామాలయం మొదటి అంతస్తులో రామ దర్బార్ ప్రాణ ప్రతిష్ఠ అనంతరం తొలిసారిగా భక్తుల సందర్శనకు అనుమతిస్తున్నారు. శనివారం నుంచి భక్తులను రామ దర్బార్ సందర్శనకు అనుమతించాలని ట్రస్ట్ నిర్ణయం తీసుకుంది. దీంతో శనివారం సాయంత్రం 5-7, 7-9 గంటల మధ్య రెండు స్లాట్లలో రామ దర్బార్‌ను సందర్శించేందుకు పరిమిత సంఖ్యలో భక్తులను అనుమతించాలని నిర్ణయించిట్టు శ్రీ రామ జన్మభూమి తీర్థ్ క్షేత్ర ట్రస్టు సభ్యులు అనిల్ మిశ్రా తెలిపారు. రామదర్బార్ ప్రతిష్ఠాపన జూన్ 5వ తేదీ ఉదయం 6 గంటలకు ప్రత్యేక పూజల అనంతరం మధ్యాహ్నం 1.25 నుంచి 1.40 గంటల మధ్య అభిజిత్ ముహూర్తంలో జరిగింది. రామాలయంలోని మొదటి అంతస్తులో రాముడు, సీత, లక్ష్మణుడు, భరతుడు, శత్రుఘ్నుడు, హనుమంతుడితో కూడిని రామదర్బార్ విగ్రహాలకు ప్రాణ ప్రతిష్ఠ జరిగింది. వీటితోపాటు- ఆలయ ప్రాంగణంలో మరో ఏడు దేవాలయాల్లో విగ్రహాల ప్రాణప్రతిష్ఠ జరిగింది. రామ్‌లల్లా దర్శనం తరహాలోనే రామదర్బార్ దర్శనానికీ పాసులు జారీ చేస్తున్నామని అనిల్ మిశ్రా తెలిపారు. ప్రతి రెండు గంటలకు ఒక స్లాట్ ఉంటుందని, ఒక్కో స్లాట్‌కు 300 పాసులు జారీ చేస్తామని చెప్పారు. ఉదయం 7-9, 9-11, మధ్యాహ్నం 1-3, 3-5, సాయంత్రం 5-7, 7-9 వరకూ దర్శనం స్లాట్‌లు ఉంటాయని చెప్పారు.

వేగుచుక్క



# పాక్‌లో దంగల్‌ను
## అందుకే విడుదల చేయలేదు

బాలీవుడ్ స్టార్ హీరో అమిర్ ఖాన్ వైవిధ్యమైన సినిమాలతో ప్రేక్షకులని ఎంతగా అలరిస్తున్నారో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అమిర్‌ఖాన్ దర్శకత్వం వహించడంతో పాటు- ప్రధాన పాత్రలో రూపొందిన తారే జమీన్ పర్ 2007లో విడుదలై సంచలన విజయం సాధించింది.. ఇప్పుడు ఈ చిత్రానికి సీక్వెల్‌గా రూపొందించిన సినిమా సితారే జమీన్ పర్ . 2018లో స్పానిష్ ఛాంపియన్స్ మూవీ ఆధారంగా హిందీలో రూపొందించిన ఈ సినిమాకు దివ్య నిధి శర్మ కథ అందించగా . ఆర్.ఎ. ప్రసన్న దర్శకత్వం వహించాడు. ఈ మూవీని అమిర్ ఖాన్ స్వయంగా నిర్మించాడు. జెనీలియా దేశ్‌ముఖ్ కీలక పాత్ర పోషించింది. జూన్ 20న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. గత కొద్ది రోజులుగా మూవీ ప్రమోషన్స్‌తో బిజీగా ఉన్న అమిర్ ఖాన్ ఆసక్తికర విషయాలు పంచుకుంటు-న్నారు. ఆయన నటించిన బ్లాక్‌బస్టర్ మూవీ 'దంగల్' పాకిస్తాన్‌లో ఎందుకు విడుదల కాలేదన్న అంశంపై తాజాగా వివరణ ఇచ్చారు. పాక్ లో దంగల్ సినిమా విడుదల కావాలంటే వారు రెండు షరతులు పెట్టారు. మన జాతీయ గీతం, జాతీయ జెండాను మూవీ నుంచి తొలగించాలని అక్కడి సెన్సార్ బోర్డు చెప్పడంతో నేను దానికి ఏ మాత్రం అంగీకరించలేదు. గీతా ఫోగట్ మ్యాచ్ గెలిచిన సన్నివేశంలో భారత జెండాతో పాటు జాతీయ గీతం ఉంటుంది. ఆ రెండింటిని తొలగిస్తినే ఈ చిత్రానికి అనుమతి ఉంటుందని పాక్ సెన్సార్ చెప్పింది. దీంతో వెంటనే నేను మా సినిమా పాకిస్తాన్ లో విడుదల కాదని చెప్పాను. పాకిస్తాన్ విడుదలను రద్దు చేయడం వల్ల కలెక్షన్స్ విషయంలో కాస్త ప్రతికూల ప్రభావం పడుతుందని నిర్మాతలు నాతో చెప్పారు. అయినప్పటికీ, భారతదేశానికి వ్యతిరేకంగా ఉన్న దేనికీ మద్దతు ఇవ్వకూడదని స్పష్టంగా ఆరోజే చెప్పాను అని అమిర్ ఖాన్ అన్నారు. సినిమా విడుదల వల్ల డబ్బు వస్తుంది, కానీ దేశ ప్రయోజనాల విషయంలో మేము రాజీ పడం. దేశానికి వ్యతిరేకంగా ఏ నిర్ణయానికీ మేము ఒప్పుకోము. ఇది నా ఒక్క నిర్ణయమే కాదు, అందరం కూడా అదే అభిప్రాయంతో ఉన్నామని అమిర్ స్పష్టం చేశారు. 2016లో విడుదలైన 'దంగల్' చిత్రం భారత రెజ్లింగ్ చాంపియన్స్ అయిన ఫోగాట్ సిస్టర్స్ జీవితం ఆధారంగా రూపొందింది. ప్రపంచవ్యాప్తంగా ...2,000 కోట్లకు పైగా వసూలు చేసిన ఈ చిత్రం చైనాలో కూడా ఘన విజయం సాధించింది.

## క్రేజీ హీరోయిన్ శ్రీలీల బర్త్‌డే



రెండు సినిమాలకు సంబంధించి పోస్టర్ల విడుదల ప్రస్తుతం సౌత్ లో క్రేజీ హీరోయిన్‌గా దూసుకుపోతోంది శ్రీలీల. అనతి కాలంలోనే తన అందం, అభినయం, ఎనర్జీతో మంచి క్రేజ్ సంపాదించుకున్న ఈ ముద్దుగుమ్మ జూన్ 14 తన పుట్టినరోజును జరుపుకుంది. ఈ సందర్భంగా శ్రీలీలకు పలువురు విషెస్ చెప్పారు. ఆమె నటిస్తున్న రెండు భారీ ప్రాజెక్టుల నుంచి బ్యాక్ టూ బ్యాక్ స్పెషల్ పోస్టర్స్‌ను విడుదల చేశారు నిర్మాతలు. ఇందులో 'ఉస్తాద్ భగత్ సింగ్' ఒకటి పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో శ్రీలీల కథానాయికగా నటిస్తోంది. ఈ సినిమా నుంచి విడుదలైన పోస్టర్‌లో ఆమె గ్లామర్‌తో పాటు డ్రస్సింగ్ ÷-టసైల్ కూడా ఫ్యాన్స్‌ను ఆకట్టుకుంది. ఇక అలాగే.. మరోవైపు మాస్ రాజా రవితేజ 'మాస్ జాతార' మూవీ నుంచి కూడా బర్త్‌డే స్పెషల్ పోస్టర్ విడుదలైంది. ఇందులో శ్రీలీల మరోసారి ట్రెడిషనల్ లుక్‌లో కనిపించి ఫ్యాన్స్‌ను ఫిదా చేసింది. ఈ సినిమాలో ఆమె పాత్ర కు సంబంధించి ఇంకా పూర్తి వివరాలు బయటకు రాలేనప్పటికీ, పోస్టర్ చూస్తేనే ఆమె పాత్ర పట్ల ఆసక్తి పెరిగింది. ఇక ఈ రెండు పోస్టర్లు బర్త్‌డే సందర్భంగా విడుదల కావడంతో శ్రీ లీల అభిమానులు సోషల్ మీడియాలో భారీగా పోస్టులు షేర్ చేస్తున్నారు. కాగా శ్రీలీల కెరీర్‌లో చిత్రాలు మరో మైలురాయిగా నిలవనున్నాయి.



## దర్శకుడిగా మారుతున్న కమెడియన్ రామకృష్ణ

టాలీవుడ్ కమెడియన్ రాహుల్ రామకృష్ణ దర్శకుడిగా మారనున్నారు. నటులు చాలామంది హీరోలుగా లేదా దర్శకులుగా మారుతున్నారు. ఇప్పటికే వేణు బలగం సినిమాతో దర్శకుడుగా మంచి పేరు సంపాదించారు. ఈ క్రమంలో రామకృష్ణ కూడా త్వరలోనే మెగాఫోన్ పట్టి ఒక చిత్రాన్ని తెరకెక్కించ నున్నారు. ఈ మేరకు ఆయన ప్రయత్నాలు మొదలుపెట్టారు. తాను దర్శకత్వం వహించనున్న తొలి ప్రాజెక్ట్‌కు సంబంధించి నటీమణుల ఎంపిక ప్రారంభించారు. ఇదే విషయాన్ని తెలియజేస్తూ ఎక్స్ వేదికగా శనివారం ఉదయం ఆయన పోస్ట్ పెట్టారు. దర్శకుడిగా నా తొలి ప్రాజెక్ట్.. మీలో ఎవరికైనా ఆసక్తి ఉంటే దయచేసి మీ షోరీల్స్, ఫొటోలను నా మెయిల్‌కు పంపించగలరని పేర్కొన్నారు. ఈ చిత్రానికి ఆయనే నిర్మాతగానూ వ్యవహరించనున్నట్లు- తెలుస్తోంది. షార్ట్ ఫిల్మ్స్‌తో నటుడిగా మారిన రాహుల్ రామకృష్ణ..'జయమ్ము నిశ్చయమ్మురా'తో పరిశ్రమకి ఎంట్రీ ఇచ్చారు. ఈ చిత్రానికి డైలాగ్ రైటర్‌గానూ వర్క్ చేశారు. 2017లో విడుదలైన 'అర్జున్ రెడ్డి' ఆయనకు గుర్తింపు తెచ్చిపెట్టింది. ఆ సినిమా తర్వాత ఆయన తెలుగులో 'భరత్ అనే నేను', 'చి.ల.సౌ.', 'గీత గోవిందం', 'కల్కి', 'బ్రోచేవారెవరురా', 'అల.. వైకుంఠపురములో..', 'జాతిరత్నాలు', 'ఓం భీమ్ బుష్' వంటి చిత్రాల్లో నటించి ప్రేక్షకులను అలరించారు.

## నటి కల్పికపై మరో కేసు



ప్రముఖ సినీ నటి కల్పిక గణేష్ మీద రోజుకో వార్త పుట్టుకోస్తోంది. తాజాగా ఆమె పై మరో కేసు నమోదయింది. అసలు విషయంలోకి వెళితే.. ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ లో అసభ్యకరమైన పదజాలం ఉపయోగించి తనను దూషించింది అంటూ బాధితురాలు కీర్తన పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు ఇచ్చింది. ఆ÷-లనైన్ అబ్యూజింగ్ తో పాటు వేధింపులకు కూడా పాల్పడినట్లు ఆమె తన ఫిర్యాదులో తెలిపింది. ఇక సోషల్ మీడియాలో స్టేటస్ పెట్టు-కోవడంతో పాటు-, బాధితురాలికి మెసేజ్ పెట్టి కల్పిక చాలా వల్గర్‌గా మాట్లాడిందట. ఇన్ బాక్స్ మెసేజ్లను, స్టేటస్ పెట్టిన స్క్రీన్ షాట్‌లను పోలీసులకు బాధితురాలు కీర్తన చూపించింది. దీంతో హైదరాబాద్ సైబర్ క్రూమ్ పోలీసులు రంగంలోకి దిగి కేసు నమోదు చేసుకున్నారు.

## కుబే మూవీ టీజర్ విడుదలకు రంగం సిద్ధం

### హైదరాబాద్ వేదికగా నేడు గ్రాండ్ ఈవెంట్




శేఖర్ కమ్ముల దర్శకత్వంలో తమిళ నటుడు ధనుష్, టాలీవుడ్ నటుడు నాగార్జున, రష్మిక మందన్నా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం కుబేర టీజర్ విడుదలకు రంగం సిద్ధం అయ్యింది. హైదరాబాద్ వేదికగా ఆదవారం ఈవెంట్‌ను గ్రాండ్‌గా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. వచ్చే వారం రిలీజ్ కాబోతున్న కుబేర సినిమాపై ఆడియెన్స్‌లో ఉన్న ఎక్స్‌పెక్టేషన్స్ అన్నీ ఇన్నీ కావు. ఎప్పుడెప్పుడు సినిమా రిలీజవుతుందా అని ఉత్కంఠగా వేయిట్ చేస్తున్నారు.పాన్ ఇండియా లెవల్లో తెరకెక్కుతున్న ఈ సినిమాను శ్రీ వెంకటేశ్వర సినిమాస్ , అమిగోస్ క్రియేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్లపై సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు నిర్మిస్తుండగా.


## లిప్‌లాక్‌లకు తాను దూరం



'రోజా' మూవీతో సినీ ప్రియుల హృదయాలు గెలుచుకున్న నటి మధుబాల. ఆ తరవాత జెంటిల్‌మెన్, అల్లరి ప్రియుడు వంటి సూపర్ చిత్రాల్లో మధుబాల పేరు సంపాదించుకుంది. మధుబాల ప్రస్తుతం 'కన్నప్ప' కోసం వర్క్ చేస్తున్నారు. ప్రస్తుతం సహాయ నటి పాత్రల్లో నటిస్తూ ప్రేక్షకులను అలరిస్తోన్న ఆమె తాజాగా ఓ ఇంటర్వ్యూలో తన కెరీర్ ఆరంభంలో ఎదుర్కొన్న పలు ఇబ్బందుల గురించి మాట్లాడారు. ముఖ్యంగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టినప్పుడు నటిగా తాను కొన్ని షరతులు పెట్టుకున్నానని తెలిపారు. ఒక సినిమా కోసం తాను ఆ రూల్ బ్రేక్ చేయాల్సి వచ్చిందన్నారు. తీరా చూస్తే ఆ సన్నివేశాన్ని తొలగించారని వెల్లడించారు. స్కిన్ షో లేదా ముద్దు సన్నివేశాల్లో నటించడం నాకు నచ్చేది కాదు. అందుకే కథానాయికగా ఎంట్రీ ఇచ్చిన సమయంలోనే ఆయా సన్నివేశాల్లో నటించకూడదని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఆ కారణంతోనే చాలా సినిమాలు వదులుకున్నా. అయితే, ఓ సినిమా కోసం నేను ఆ రూల్ బ్రేక్ చేయాల్సి వచ్చింది.

## సిఎంతో సినీ పెద్దలతో భేటీ నేడే

22వ తేదీకి బదులు ఆదివారానికి మార్పు నేటి సాయంత్రంచంద్రబాబుతో ప్రముఖులు సమావేశం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుతో సినీ ఇండస్ట్రీ పెద్దల సమావేశం తేదీల్లో మార్పులు చేశారు. ఈ నెల 22వ తేదీకి బదులు ఆదివారం సీఎంతో భేటీ కావాలని నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం నాడు సాయంత్రం 4గంటలకి అమరావతిలో సీఎం చంద్రబాబుతో తెలుగు సినీ పరిశ్రమ ప్రముఖులు భేటీ కానున్నారు. కాగా, ఈ సమావేశానికి పవన్ కళ్యాణ్ నేతృత్వం వహించబోతున్నారు. పవన్ కళ్యాణ్ సినిమా షూటింగ్ కోసం విదేశాలకు వెళ్లనున్నారు.. ఈ నేపథ్యంలో ఆదివారమే సినీ పెద్దల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ భేటీలో సినిమాల్లో తమకు ఎదురవుతున్న సమస్యలు, ఏపీలో షూటింగ్లకు పర్మిషన్, లొకేషన్ సమస్యలు, పన్నుల విధానం, సినీ



పరిశ్రమ అభివృద్ధి తదితర అంశాలపై ప్రధానంగా చర్చించే అవకాశం ఉంది. ఏపీలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సీఎం చంద్రబాబుతో సినీ పెద్దలు సమావేశం కావడం ఇదే మొదటిసారి. ఇప్పటి వరకు సినిమావాళ్లు సీఎంను కలవకపోవడంతో ఇటీవల పవన్ కళ్యాణ్ తీవ్రంగా మండిపడిన విషయం తెలిసిందే. అలాగే, ఏపీలో థియేటర్ల పరిస్థితి.. సదుపాయాలకు సంబంధించి సమగ్ర నివేదిక ఇవ్వాలని ఇటీవల సినిమాటోగ్రఫీ శాఖ ఆదేశాలు జారీ చేసింది. రంగంలోకి దిగిన అధికారులు.. థియేటర్లలో తనిఖీలు చేపట్టారు. మరోవైపు, రాష్ట్ర విభజన జరిగి 11 ఏళ్ళు అయినా పూర్తిగా సినీ ఇండస్ట్రీ రాలేదు.. కనీసం సింగిల్ షెడ్యూల్ సినిమా కూడా ఏపీలో తీయలేని పరిస్థితి ఏర్పడింది. ఈ పరిణామాలతో ఈ సమావేశానికి మరింత ప్రాధాన్యత చోటు చేసుకుంది. కేవలం సినిమా టిక్కెటల్ ధరలు పెంచుకునే క్రమంలో మాత్రమే కలుస్తున్నారన్న విమర్శలు కూడా ఉన్నాయి. ప్రభుత్వం ఏం చెబుతుంది, సినీ ప్రముఖులు ఏం కోరతారనే అంశంపై ఉత్కంఠ కొనసాగుతుంది.